పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 82. అల్ ఇన్‌ఫితార్ సూరా పరిచయం

ఈ సూరా మక్కాలో అవతరించింది. ఇందులో 19 ఆయత్‌లు ఉన్నాయి.

ఇంతకు మునుపటి సూరాలోనూ, ఈ సూరాలోనూ పరలోకం గురించిన ప్రస్తావన వచ్చింది. సూరయె తక్వీర్‌లో ఖుర్‌ఆన్‌ను రుజువుగా పేర్కొనబడింది. ఇది దైవవాణి అనీ, ఇది అల్లాహ్ తరఫున పవిత్రుడు, విశ్వసనీయుడు, దూత అయిన హజ్రత్ జిబ్రయీల్ ద్వారా, సత్యవంతుడూ, అమీన్ అయిన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంపై అవతరించిన వాణి. ఈ వాణి మిమ్మల్ని పరలోకం కోసం సన్నాహం వైపు ఆహ్వానిస్తుంది. మీ విశ్వాసాన్ని ఆచరణను సక్రమంగా ఉంచుకుంటే సాఫల్యం చెందగలరు అని చెబుతూంది.

కాని తిరస్కారులు బహుదైవారాధకులు ఖుర్‌ఆన్‌ను మంత్రగాళ్ళ జాల విద్య అనీ, కవుల కవనం అనీ అంటూ తిరస్కరించారు. దైవవాణిలో – మంత్రగాడి మాటల్లో తేడాను గ్రహించలేని వారు రాత్రి, పగలులోనూ తేడాను గ్రహించలేరు. వాస్తవానికి రాత్రిలోను పగలులోనూ చాలా పెద్ద తేడా ఉంది. రాత్రి చీకటిగా ఉంటే పగలు వెలుగుతో నిండి ఉంటుంది. అదేవిధంగా కుఫ్ర్ (తిరస్కారం) లో ఇస్లాం (విధేయత)లో పెద్ద తేడా ఉంది. సూరయె ఇన్‌ఫితార్‌లో ఆఖిరత్‌కు రుజువు ఎలా ఉందంటే, అల్లాహ్ మానవుణ్ని ప్రాణులలో అత్యున్నత ప్రాణిగా పుట్టించాడు. మానవుడు వర్షంలో పుట్టే పురుగులలాంటి వాడు కాడు. అడవిలో తిరుగాడే జంతువుల వంటి వాడు కాడు. మనిషి. ఆకాశంలో ఎగిరే పక్షుల లాంటి వాడు కాదు. అల్లాహ్ సృష్టించిన 18 వేల రకాల ప్రాణులలో మనిషి అందరికన్నా ఉన్నతుడు, శ్రేష్ఠుడు. అంతేకాదు దైవదూతలకన్నా ఉన్నత స్థానం కలవాడు. అల్లాహ్ తర్వాత, అందరికన్నా గొప్ప స్థానం మానవుడిది. మానవుడికి అపారమైన శక్తినీ, బలాన్నీ ఇచ్చాడు అల్లాహ్. జ్ఞానం బుద్ధి, కళ్ళూ, చెవులూ, వగైరా మానవుడికి ఇన్ని యోగ్యతలు ఇన్ని శక్తులు, వరాలతో అనుగ్రహించిన అల్లాహ్ మానవుడ్ని తానిచ్చిన అనుగ్రహాల లెక్క చెప్పమని అడుగడా? లెక్కలు తీసుకోవడానికే కిరామన్, కాతిబీన్ అనే దూతల్ని అల్లాహ్ మానవుడి వెంట ఉంచాడు. ఒక దూత సత్కర్మల్ని లిఖిస్తే, మరో దూత దుష్కర్మల్ని వ్రాసి ఉంచుతాడు. లెక్క తీసుకోవడానికి మనపై పర్యవేక్షకులు నియమించబడివున్నారు. మన కర్మల రికార్డు ఉంచబడుతోంది. మనం ఆఖిరత్ పట్ల ఏమారి ఉండకూడదు.

# 82. అల్ ఇన్‌ఫితార్

**ఆయత్‌లు : 19** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

(1) ఆకాశం చీలిపోయినప్పుడు (2) నక్షత్రాలు చెల్లాచెదరైనప్పుడు (3) సముద్రాలు పొంగిపోయినప్పుడు (4) గోరీలు తెరువబడినప్పుడు (5) ప్రతి మనిషీ తాను ముందుగా ఏమి పంపాడో, వెనుక ఏమి వదిలాడో తెలుసుకుంటాడు. (6) ఓ మనిషీ! ఏ వస్తువు నిన్ను దయామయుడైన అల్లాహ్ విషయంలో మోసంలో పడవేసింది? (7) ఆయనే కదా నిన్ను పుట్టించాడు, నీ అవయవాల్ని సక్రమం చేశాడు. (8) నిన్ను తగిన ఆకృతిలో రూపొందించాడు!? (9) కాని మీరు శిక్షా, బహుమానాలను తిరస్కరిస్తున్నారు. ఇది విచారకరం. (10) వాస్తవానికి మీపై పర్యవేక్షకులయిన దూతలు నియమించబడి ఉన్నారు. (11) వారి పేర్లు కిరామన్, కాతిబీన్. (12) వారు మీ ప్రతి పనినీ ఎరుగుదురు. (పుణ్యం చేస్తే పుణ్యం వ్రాస్తారు. పాపం చేస్తే పాపం వ్రాస్తారు.)

(13) నిశ్చయంగా పుణ్యశీలురు భాగ్యాలతో నిండిన స్వర్గంలో ఉంటారు. (14) చెడ్డవాళ్ళు నరకంలో ఉంటారు. (15) ప్రతిఫల దినాన అందులో ప్రవేశిస్తారు. (16) అందులో వారు ఎల్లకాలం దహించబడుతూ ఉంటారు. దాని నుండి వేరయిపోకుండా ఉంటారు. (17) ప్రతిఫలదినం గురించి నీకేం తెలుసు? (18) మరోసారి అడుగుతున్నాను. శిక్షా బహుమానాల రోజు గురించి నీకేమి తెలుసు? (19) ఆ రోజు ఎవరూ ఎవరికీ అక్కరకు రారు. తీర్పు కేవలం అల్లాహ్ చేతులలో ఉంటుంది. (అల్లాహ్ ఎవరికి నరకం నిర్ణయిస్తాడో ఆ తీర్పుని ఎవరూ మార్చలేరు).

آيَاتُهَا 19 | 82 سُورَةُ الْانْفِطَارِ مَكِّيَّةٌ | رُكُوعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

إِذَا السَّمَآءُ انْفَطَرَتْ ﴿1﴾ وَإِذَا الْكَوَاكِبُ
انْتَثَرَتْ ﴿2﴾ وَإِذَا الْبِحَارُ فُجِّرَتْ ﴿3﴾ وَإِذَا
الْقُبُورُ بُعْثِرَتْ ﴿4﴾ عَلِمَتْ نَفْسٌ مَّا قَدَّمَتْ
وَأَخَّرَتْ ﴿5﴾ يَا أَيُّهَا الْإِنْسَانُ مَا غَرَّكَ بِرَبِّكَ
الْكَرِيمِ ﴿6﴾ الَّذِي خَلَقَكَ فَسَوّٰكَ فَعَدَلَكَ
﴿7﴾ فِي أَيِّ صُورَةٍ مَّا شَآءَ رَكَّبَكَ ﴿8﴾
كَلَّا بَلْ تُكَذِّبُونَ بِالدِّينِ ﴿9﴾ وَإِنَّ عَلَيْكُمْ
لَحٰفِظِينَ ﴿10﴾ كِرَامًا كَاتِبِينَ ﴿11﴾ يَعْلَمُونَ
مَا تَفْعَلُونَ ﴿12﴾ إِنَّ الْأَبْرَارَ لَفِي نَعِيمٍ ﴿13﴾
وَإِنَّ الْفُجَّارَ لَفِي جَحِيمٍ ﴿14﴾ يَصْلَوْنَهَا يَوْمَ
الدِّينِ ﴿15﴾ وَمَا هُمْ عَنْهَا بِغَآئِبِينَ ﴿16﴾
وَمَآ أَدْرٰىكَ مَا يَوْمُ الدِّينِ ﴿17﴾ ثُمَّ مَآ
أَدْرٰىكَ مَا يَوْمُ الدِّينِ ﴿18﴾
يَوْمَ لَا تَمْلِكُ نَفْسٌ لِّنَفْسٍ شَيْـًٔا ۖ وَالْأَمْرُ
يَوْمَئِذٍ لِّلّٰهِ ﴿19﴾ ع 1 19 7

1 – 19 వాక్యాలు

అంతిమదినాన అల్లాహ్ పుణ్యాత్ములు, పాపాత్ములతో ఒకే రకంగా వ్యవహరించడు. సత్కర్మలు చేసిన వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. అక్కడ వారు శాశ్వతంగా సుఖంగా ఉంటారు. దుష్కర్మలు చేసిన వారిని అల్లాహ్ నరకంలో పడవేస్తాడు. అక్కడ వారు బాధాకరమయిన శిక్షలో మగ్గుతూ ఉంటారు. కొందరు ఔలియాల వసీలాతో లేక పెద్దల సిఫారసుతో మనం నరకబాధ నుండి తప్పించుకుంటాం అని భావిస్తారు. అయితే ఇది నిజం కాదు. ఎందుకంటే తీర్పుదిన యజమాని అల్లాహ్ మాత్రమే. సిఫారసుకు యజమాని కూడా అల్లాహ్‌యే. ఆయన అనుమతి లేనిదే ఎవరూ సిఫారసు చేయజాలరు. తీర్పుదినం నాడు సకల మానవులు, అందరు దూతలు, జిన్నులు అల్లాహ్ ఎదుట బారులు తీరి బానిసల్లాగా నిలబడి ఉంటారు. సిఫారసు చేయడం అటుంచి వారు మాట్లాడనూ లేరు. సిఫారసు కోసం అల్లాహ్ కొన్ని షరతులు పెట్టాడు : 1. సిఫారసుకు అల్లాహ్ అనుమతి ఇవ్వాలి. 2. అల్లాహ్ ఎవరిని చూపిస్తే అతడి గురించే సిఫారసు జరుగుతుంది. 3. సిఫారసు చేసేవాడు సత్యం పలకాలి.